క్లుప్తంగా

జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న గుండా శ్రీనివాస్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌ను సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సన్మానించారు. శ్రీరాంపూర్ పర్యటనకు వచ్చిన ఆయన నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను బుధవారం జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సత్కరించారు. సింగరేణి పాఠశాల, పాలిటెక్నిక్‌కాలేజీకి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ మైనింగ్ హెచ్‌వోడీ నర్సింహాస్వామి, సీసీసీ సింగరేణి పాఠశాల హెడ్ మాస్టర్ సంతోశ్, ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

హెడ్‌మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తాండూర్: మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తున్న హెడ్ మాస్టర్, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌లకు బుధవారం వినతిపత్రం అందజేశారు. హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు జ్యోతి దూషిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి దాగం రాజారాం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళ ఆందోళన



మందమర్రిరూరల్: రామన్‌కాలనీకి చెందిన వొడ్నాల శ్రీనివాస్‌తో పాటు మరికొందరి వేధింపుల వల్లనే తన భర్త వినయ్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు వినయ్ భార్య భాగ్యలక్ష్మి ఆరోపించింది. శ్రీనివాస్ ఇంటి ఎదుట బుధవారం కుటుంబ సభ్యులతో పాటు రజక వృత్తిదారుల సంఘం నాయకులతో కలిసి ఆందోళన చేపట్టింది. శ్రీనివాస్‌తో పాటు అతడి మిత్రులపై వెంటనే కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

ఆలయ భూములు వేలం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములను బుధవారం వేలం వేశారు. సంవత్సర కాలానికి వేలం వేయగా కన్నెపల్లి మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. 3లక్షల 45వేల 500కు దక్కించుకున్నారు. నగదును ఆలయ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చిక్కుడు తీగలు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: భీమిని మండలం వెంకటాపూర్ గ్రామంలో కరెంట్ తీగలపై ఎగబాకిన చిక్కుడు తీగల తీరుపై 'అల్లుకున్న ప్రమాదం' అనే శీర్షికతో ఈ నెల 4న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ సిబ్బంది బుధవారం ఆ గ్రామానికి వెళ్లి కరెంట్‌తీగలకు అల్లుకున్న చిక్కుడు తీగను తొలగించేసి ప్రమాదం జరగకుండా నిలువరించారు.

అందంగా ఉన్నానా..!



జన్నారం: అద్దంలో మనుషులు అందం చూసుకోవడం మామూలే.. కానీ జన్నారం మండలం బస్టాండ్ ఎదుట ఓ వానరం ద్విచక్రవాహనంపై కూర్చొని సందడి చేసింది. అద్దంలో తొంగిచూస్తూ.. కాసేపు తన అందాన్ని చూసుకుంటూ మురిసిపోయింది. వాహనదారుడు రావడంతో అక్కడి నుంచి జారుకుంది. ఈ దృశ్యాన్ని అటుగా వెళ్తున్న 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

పడిపోయేలా ఉంది.. పట్టించుకోండి



భీమారం: మండలంలోని అంకూసాపూర్ క్రాస్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం వరకు గల ప్రధాన రోడ్డు గుండా ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ లైన్‌లో పలు విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

పునరావాసం ఎప్పుడో..?

- కళ్యానిఖని ఓసీ నిర్వాసితుల ఆందోళన
- భూములు ఇచ్చినా ప్లాట్ల కేటాయింపులో జాప్యం
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి చేతులు దులుపేసుకున్న సింగరేణి
- త్వరలో పనులు ప్రారంభించేందుకు కసరత్తు
- ఆందోళనలో నిర్వాసితులు



పునరావాస కాలనీలో కొనసాగుతున్న పనులు

కాసిపేట: మండలంలోని కళ్యాణిఖని గని ఓపెన్ కాస్టు నిర్వాసిత గ్రామం దుబ్బగూడెం గ్రామస్తులకు పునరావాసానికి పడిగాపులు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస కాలనీలో ప్లాట్ల కేటాయింపు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితమే సర్వేలు చేసిన ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం దుబ్బగూడెం గ్రామస్తులను ఒప్పించి 2018లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించింది. రెండు సంవత్సరాల క్రితం గ్రామస్తులకు రావాల్సిన నష్టపరిహారం చెల్లించింది. అప్పటి నుంచి నేడు.. రేపు.. అంటూ కాలయాపన చేస్తూ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కాలం గడుపుతూ వస్తోంది. ప్రస్తుతం ఓసీలో రెండు టెండర్లు ముగియడంతో, మరో టెండర్‌కు నాంది పలుకుతున్నారు. ప్రస్తుతం టెండర్ పూర్తయితే గ్రామం దగ్గరలో పనులు ప్రారంభించాల్సి ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో దూరంలో బ్లాస్టింగ్ పనులు నడిచినప్పుడే ఇళ్లు కూలిపోయి, పగుళ్లు తేలుతూ ఇబ్బందులు పడ్డామని, పనులు మరింత దగ్గరైతే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఓసీ బ్లాస్టింగ్ దుమ్ము దూళితో పిల్లలు, వృద్ధులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

పూర్తికాని పునరావాస కాలనీ పనులు...

త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని చెప్పి రెండేళ్ల క్రితమే పెద్దనపల్లి శివారులో దుబ్బగూడెం గ్రామస్తులకు పునరావాసం కల్పించేందుకు యాజమాన్యం స్థలం కొనుగోలు చేసి పనులు ప్రారంభించింది. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. అధికారులు వచ్చి పరిశీలించడం, త్వరలో పూర్తి చేస్తామని చెప్పడం మినహా, త్వరగా అందించేలా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్, పాఠశాల భవనం, డ్రెయినేజీ, వాటర్ ట్యాంక్, రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, షాపింగ్ కాంప్లెక్స్, సబ్‌సెంటర్ లాంటి నిర్మాణాలు పూర్తయ్యే దశలోకి చేరుకున్నాయని, అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదనే విమర్శలున్నాయి. విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రగతి లేదని, పనులు ప్రారంభానికి నోచుకోలేదనే విమర్శలున్నాయి. గ్రామంలో 203బాధిత కుటుంబాలు ఉండగా, కుటుంబంలో మేజర్లను కలుపుకొని సుమారు 300మంది లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించారు.

వర్షాకాలంలో ఇబ్బందులే..

ప్రతీ వర్షాకాలంలో మూడేళ్లుగా గ్రామంలో ఇళ్లు కూలుతూ వస్తున్నాయి. పునరావాస కాలనీకి వెళ్లాల్సి ఉండటంతో పాత ఇళ్లు మరమ్మతులు చేపించలేక, ఎప్పుడు కూలుతుందో తెలియక భయం గుప్పిట్లో జీవిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం త్వరగా ప్లాట్లు కేటాయించి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించినట్లైతే వర్షకాలం ప్రారంభమయ్యే నాటికి కొంతమంది నిర్మాణాలు పూర్తి చేసుకుంటారని, జాప్యం చేస్తే వర్షకాలంలో ఇబ్బందులు, ప్రమాదాలు తప్పవని వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి యాజమాన్యం ద్వారా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి కేటాయించాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేసి అప్పగించాలి



గ్రామంలో ఇబ్బందులతో కాలం గడపాల్సి వస్తోంది. త్వరితగతిన పనులు పూర్తి చేసి గ్రామస్తులకు అప్పగించాలి. వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నాం. పనిస్థలాలు దగ్గరవుతుంటే ఇళ్లు కూలుతాయేమోనని భయంగా గడుపుతున్నాం. వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు కేటాయించాలి.

– బూరుగుపల్లి రమేశ్, గ్రామస్తుడు

మహిళల భద్రత కోసమే షీటీమ్



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సిబ్బంది

బెల్లంపల్లి: మహిళలకు భద్రత కల్పించడం కోసమే షీటీమ్‌ను పోలీసుశాఖ ఏర్పాటు చేసిందని జిల్లా షీటీమ్ సిబ్బంది తెలిపారు. బెల్లంపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం తాళ్లగురిజాల పోలీసుల ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిబ్బంది పాల్గొని మాట్లాడారు. రోజువారీగా బస్టాండ్‌లు, కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీటీమ్ సిబ్బంది నిఘా ఉంటున్నారని తెలిపారు. ఆకతాయిలు వేధించకుండా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడకుండా తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలుగుతున్న నష్టాలు అనేకం ఉంటున్నాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా స్వీయ నియంత్రణ చర్యలు తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే నిర్భయంగా 63039 23700 నంబర్‌కు కానీ, 100కు కానీ డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఏఎస్సై మజార్ హుస్సేన్, జిల్లా షీటీమ్ సిబ్బంది జ్యోతి, సతీష్, కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారిణి రజిత, సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



వీసీబీని ప్రారంభిస్తున్న ఎస్ఈ గంగాధర్

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏకు అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పట్టణంలో మరింత మెరుగైన నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. బంచ్‌డ్ ఫీడర్ వేరు చేసి 11కేవీ కలెక్టరేట్‌కు ప్రత్యేక వీసీబీని ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా కలెక్టరేట్‌కు సైతం మెరుగైన విద్యుత్ సరఫరా అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ కైసర్, ఎంఆర్‌టీ డీఈ రాజన్న, ఏడీఈలు మోహన్‌రెడ్డి, శరత్, ఏఈలు కలీమ్, మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వలస కూలీ మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నివాసం ఉంటున్న వలస కూలీ అనారోగ్యంతో మృతి చెందినట్లు ఏఎస్సై బీ.సత్తయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దండేపల్లి మండలం గూడెంకు చెందిన కుర్రే అంజయ్య(57) మంచిర్యాలకు బతుకుదెరువు కోసం వచ్చాడు. అడ్డమీద కూలి పనిచేసుకుంటూ ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న సామిల్‌లో ఉండేవాడు. బుధవారం ఉదయం చాతిలో నొప్పి రాగా ఆసుపత్రికి వెళ్తుండగా నొప్పి అధికమై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నాడు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఒడ్డెర కాలనీకి చెందిన బచ్చలి సన్నీ రెండు వారాల నుంచి అదే కాలనీకి చెందిన పల్లెపు మీనా వెంట పడ్డాడు. కను బొమ్మలతో అసభ్యకరంగా సైగలు చేస్తూ వేధించాడు. ఈ నెల 3న ఉదయం 6గంటలకు ఇంటి ముందు నీళ్లు పడుతుండగా అసభ్యకరంగా సౌండ్ చేస్తూ సైగలు చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సన్నీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఎన్నికలు



ఎన్నికైన సభ్యులు

పాతమంచిర్యాల: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి జిల్లా కమిటీని బుధవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్లుగా సోయం చిన్నన్న, గంజి రాజన్న, లాల్‌కుమార్, మల్యాల బాబు, జాడి దేవరాజు, గంట సత్యం, సారయ్య, సమ్మయ్య పోషన్న, చంటి శ్రీనివాస్, బొందెల బాబుయాదవ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన కమిటీ దండకారణ్యంలో ఆదివాసీ మారణ హోమాన్ని నిలువరించడమే ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్, నారాయణరావు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో చోరీ

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మూడు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన మరువక ముందే.. తపాలపూర్ గ్రామ పోచమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం పూజ కోసం వెళ్లగా గుడి తాళాలు, హుండీ పగులగొట్టి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

'ఉపాధి' పనుల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఈజీఎస్ ఏపీవో గంగాభవాని పరిశీలించారు. ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించనున్నట్లు, కొలతల ప్రకారం పనిచేస్తే ఒక కూలీకి రూ.300చెల్లించనున్నట్లు తెలిపారు.

మహాసభలు విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఈ నెల 10, 11, 12తేదీల్లో వేములవాడలో నిర్వహించే దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దేవి పోచన్న అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర భావితరాలకు అవసరం

చెన్నూర్: బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర బావితరాలకు అవసరమని అంబేడ్కర్ సంఘం చెన్నూర్ మండల అధ్యక్షుడు తగరం వెంకటి అన్నారు. స్థానిక మైనార్టీ ఫంక్షన్‌హాల్లో బుధవారం అంబేడ్కర్ జీవిత చరిత్ర సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శనలు దళిత సంఘాల నాయకులతో కలిసి ప్రారంభించారు.

విద్యార్థులకు కరెన్సీపై అవగాహన

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హిందీ బోధిస్తూ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న అనిల్‌కుమార్ 31దేశాల కరెన్సీ సేకరించారు. వాటి గురించి బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పశువుల మేతకు వెళ్లేందుకు దారివ్వాలి

కోటపల్లి: అటవీశాఖ అధికారులు పశువులకు అడవిలోకి మేతకు వెళ్లేందుకు దారి ఇవ్వకుండా పశువుల కాపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రొయ్యలపల్లి గ్రామస్తులు తెలిపారు. మూగజీవాలకు మేతలేకుండా చేస్తున్న అటవీశాఖ అధికారులు తీరు మార్చుకొని, అడవిలోకి మేతకు వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా ఉన్నటువంటి దారిని మూసివేయకుండా ఉంచాలని కోరారు.

మహిళలకు క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి నస్పూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించగా ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) ఎస్వీ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. త్రోబాల్, బాంబ్ బ్లాస్ట్, టగ్‌ఆఫ్‌వార్ వంటి పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థినులకు...

చెన్నూర్‌రూరల్: మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ యం.వీ పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్, మహిళ సాధికారిత విభాగ సమన్వయ కర్త శిరీష ప్రారంభించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జైపూర్ పరీక్ష కేంద్రం వద్ద ఆల్ ది బెస్ట్ చెబుతున్న అధ్యాపకులు



జన్నారం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల అధ్యాపకుడు



కాసిపేట పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తూ...





జన్నారం: ఆలస్యం కావడంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు



దండేపల్లి: పరీక్షకు హాజరైన విద్యార్థులు



దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తూ...





హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

జన్నారం/బెల్లంపల్లి/కాసిపేట/దండేపల్లి/చెన్నూర్/జైపూర్/మంచిర్యాలఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉదయం 9గంటలకు ప్రారంభం కాగా గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కొందరు కాస్త ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రాల్లోకి పరుగులు పెట్టారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

నియామకం

మందమర్రిరూరల్: మందమర్రిలోని తాపీ మేస్త్రీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండి సదానందంను ఎన్నుకున్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు సదానందంను సన్మానించారు.